www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025



ఆగని గజ దాడులు

- భారీ పంట నష్టం
- పట్టించుకోని అటవీ సిబ్బంది


ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి తోట

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పంట పొలాలపై గజ దాడులు అధికమైపోతున్నాయని అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యం వల్ల పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి మండలంలోని బోడబండ్ల వెలుతురు చేను పంచాయతీలోని గ్రామాల్లో ఏనుగుల గుంపులు పంట పొలాలపై దాడులు చేసి పంటలను నాశనం చేశాయని రైతులు రాజమ్మ, శంకరయ్య వాపోయారు. వరుసగా గజ దాడుల వల్ల భారీ పంట నష్టం పోతున్నామని వరి, అరటి, ఉలవ పంటలను తొక్కి నాశనం చేసి వెళ్లిపోతున్నాయని అటవీ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టకపోవడంతో తరచూ పంటల పొలాలపై దాడులు చేస్తున్నాయని నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఏనుగుల నివారించాలని పలువురు రైతులు అభ్యర్థిస్తున్నారు.

గాఢనిద్రలోనే..



- నలుగురు దుర్మరణం
- 22 మందికి గాయాలు
- వోల్వా బస్సును ఢీకొన్న టిప్పర్
- రూ.25 లక్షలివ్వాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

అర్ధరాత్రి...అందరూ గాఢనిద్రలో ఉన్నారు.. ఒక్కసారిగా టిప్పర్ వోల్వా బస్సును ఢీకొంది.. ఏం జరిగిందో తెలియక ఆర్తనాదాలు.. నిద్రలోనే నలుగురు దుర్మరణం పాలయ్యారు.. 22 మందికి గాయాలయ్యాయి. టిప్పర్ వేగంగా వచ్చి బస్సును ఢీకొందని ప్రయాణికులు వాపోయారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ప్రయాణికుల బంధువులు ఉలిక్కిపడేలా చేసింది. వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు జరుగుతుండటం గమనార్హం.

చిత్తూరు నగరానికి అతి సమీపంలోని గంగాసాగరం వద్ద గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వోల్వా ఏసి బస్సు టిప్పర్ను ఢీకొన్న ప్రమాదంలో సంఘటన స్థలంలో నలుగురు మతి చెందారు. మతి చెందిన వారిలో తిరుపతికి చెందిన శ్రీధర్, పున్ చంద్ర, తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారికి చెందిన జీవ, తంజావూరు ప్రశాంత్ గా గుర్తించారు. బస్సులో ప్రయాణిస్తున్న 22 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తిరుపతి నుండి తమిళనాడు రాష్ట్రం మధురైకి బయలుదేరిన ఏసి బస్సు 8372 గంగాసాగరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకుంది. బస్సులోని ప్రయాణికులు అందరూ నిద్రావస్థలో ఉండగా ఒక్కసారిగా బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో బస్సు బోల్తా పడింది.రోడ్డు ప్రమాద సంఘటన సమాచారాన్ని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్, పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన వారిని వేలూరు సీఎంసి, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. టిప్పర్ డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు బస్సులోని ప్రయాణికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన తాలూకా పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.


వేగంగా వచ్చి వోల్వా బస్సును ఢీకొన్న టిప్పర్

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలివ్వాలి : సిపిఎం

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రైవేట్ ట్రావెల్స్ నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయని, వాహనాలను తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎంఎల్ఎ గురజాల దిగ్భ్రాంతి

గంగసాగరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందడం, 22 మంది గాయపడటంపై ఎంఎల్ఎ గురజాల జగన్మోహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ ఆదేశాల మేరకు పిఎ కుమార్‌స్వామి యాదవ్, ఇతర సహాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని వైద్యులతో సమన్వయం చేశారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని చీలాపల్లి, రాణిపేట, వేలూరులోని సిఎంసి ఆస్పత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి స్వస్థలాలైన తిరుపతి, కన్యాకుమారికి పంపించే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు చిత్తూరు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మతదేహాలను స్వస్థలాల పంపించే ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించారు. మతుల కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

బిసి, ఎస్‌సి కార్పొరేషన్ల ఈడీలు, బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బిసి, ఎస్‌సి వర్గాల జీవనోపాధి మెరుగుకు సబ్సిడీ బ్యాంకు రుణాలు మంజూరుకు కృషి చేస్తోందని, రుణాల మంజూరులో ప్రభుత్వం సూచించిన మేరకు వందశాతం లక్ష్యాలను సాధించ డానికి బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లా సచివాల యంలోని సమావేశ మందిరం లో బిసి, ఎస్‌సి కార్పొరేషన్‌ల ఈడిలు, బ్యాంకర్లతో కలిసి కలెక్టర్ స్పెషల్ డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుక బడిన వర్గాల జీవనోపాధి మెరుగు పరిచేందుకు బిసి, ఎస్‌సి కార్పొరేషన్‌లతో పాటు ఈబిసి, రెడ్డి, కమ్మ, కాపు, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తామని ఆ మేరకు జిల్లాలోని బ్యాంకులకు రుణాల మంజూరులో లక్ష్యాలను నిర్దేశించామన్నారు. స్వయం ఉపాధి, జెనెరిక్ మందుల షాప్‌లు ఏర్పాటు, ఎంఎస్ఎంఈ ద్వారా రుణాలు మంజూరు చేస్తామని, అర్హతలను పూర్తిగా పరిశీలించాలన్నారు. బిసిలకు జెనెరిక్ మందుల షాపుల ఏర్పాటుకు, కాపులకు ఎంఎస్ఎం ఈల ద్వారా రుణాల మంజూరు చేస్తామని తెలిపారు. ఎంఎస్ఎంఈ కింద ప్రతి యూనిట్‌లో మూడు నుండి ఐదుగురు సభ్యులు ఉండేలా చూడా లన్నారు. జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి అర్హులను గుర్తించి రుణాలు మంజూరు చేస్తా మన్నారు. ప్రభుత్వ సబ్సిడీని 3 శ్లాబ్ లు గా విభజించి రాయితీ అందిస్తామని, స్వయం ఉపాధికి బిసి, ఎస్‌సిలకు వ్యవసాయం, పశుపోషణ, మోటారు వాహనాల విభాగం, పరిశ్రమల స్థాపన, వ్యాపారం, ఇతర సేవలకు రుణాల మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో బిసి కార్పొరేషన్‌తో పాటు ఈబిసి, రెడ్డి, కమ్మ, కాపు, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 2,800 యూనిట్లు, ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 678 యూనిట్ల మంజూరుకు జిల్లాలోని బ్యాంకర్లకు బ్యాంకుల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసే విషయంలో బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాల అమలుకు తద్వారా ఆర్థిక అసమాతల తొలగింపునకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న పథకాలకు బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధతో రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బిసి, ఎస్సి కార్పొరేషన్ ఈడి లు శ్రీదేవి, రాజ్యలక్ష్మి, ఎల్‌డిఎం హరీష్, జెడ్పి సిఈఓ రవికుమార్ నాయుడు, డిఎల్‌డిఓ రవికుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.


బిసి, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీలు, బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కానరాని మామిడి పూత

- రైతుల్లో దిగులు.. పంట దిగుబడిపై ఆందోళన
- పెట్టుబడి వస్తుందోలేదోనని నిరాశ
- తోటల కొనుగోలుకు వ్యాపారుల అనాసక్తత

ప్రజాశక్తి- వెదురుకుప్పం:

చలి తీవ్రత, వాతావరణంలో మార్పులు, అధిక వర్షం కారణంగా ఈ సారి మామిడి పూత కరువైనట్లు తెలుస్తోంది. ఏడాదికోసారి వచ్చే ఫలసాయం మామిడిపైనే రైతులు ఆధారపడుతుంటారు. అయితే ఆశించిన మేరకు పూత రాకపోవడం, తోటల కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రాకపోవడం, పెట్టుబడులు పెరిగిపోవడం, ఆశించిన మేర దిగుబడి వస్తుందో రాదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూత ఆలస్యం- రైతుల్లో ఆందోళన

ప్రతి ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో పూత ప్రారంభమై జనవరిలో పిందె దశలో వుండేది. అయితే చాలా వరకు ఇప్పటికీ మామిడి పూత రాలేదు. అధిక పెట్టుబడులతో దిగుబడినే నమ్ముకున్న రైతులకు నిరాశ ఎదురవుతోంది. సాధారణంగా ఇప్పటికే వ్యాపారులు తోటలు కొనుగోలు చేసేవారు. అయితే పూత కనిపించకపోవడంతో వ్యాపారులు కొనుగోలుకు మొగ్గు చూపడంలేదు. ఈ కారణంగా రైతులు దిగులు చెందుతున్నారు.

మామిడి దిగుబడిపైనే ఆధారపడి..

వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీల్లో రైతులు ఎక్కువగా చెరకు, మామిడిపైనే ఆధారపడుతుంటారు. నల్లబెల్లంపై ఆంక్షలు విధించడంతో చెరకును విడిచిపెట్టారు. మండలంలో 1600 హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి వున్నాయి. ఏడాది కోసారి వచ్చే దిగుబడిపై రైతులు ఈ సారి ఆశలు పెట్టుకున్నారు. ఆశించిన మేర పూత రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

చిరు ప్రయత్నంగా మందులు పిచికారీ

పూత రాకపోవడంతో రైతులు మందులు కొనుగోలు చేసి తోటలకు పిచికారీ చేస్తున్నారు. చివరి ప్రయత్నంగా మందులు కొని స్ప్రే చేస్తున్నామని రైతులు వాపోతున్నారు. దిగుబడి వస్తే తప్ప ఈ ఏడాది ఖర్చుపెట్టిన పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కనీసం పెట్టుబడి వస్తుందో రాదో..



గత ఏడాది కంటే ఈ ఏడాది డిసెంబరులో వర్షాలు కురిశాయి. వచ్చే పంట కూడా మగ్గి పోయింది. మందులు పిచికారీ చేస్తే పూత వస్తుంది. ఆ తర్వాత పూత నిలుస్తుందో లేదో తెలియదు.. ఈ సారి పెట్టిన పెట్టుబడి అందడం గగనమే..

సుబ్రహ్మణ్యం రెడ్డి, మామిడి రైతు.

పూత పూర్తిగా రాలేదు..



నాకు ఐదు ఎకరాల మామిడి తోట వుంది. మందులు కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఆ సారి ఇప్పటి వరకు పూత రాలేదు. మందులు కొని స్ప్రే చేస్తున్నాను. మిగతా రైతుల పరిస్థితి కూడా ఇదే..

ఆనంద రెడ్డి, మామిడి రైతు.

జర్నలిస్టుల్లో ఐక్యత అవసరం : ఏపీడబ్ల్యూజేఎఫ్

ప్రజాశక్తి -పుంగనూరు: జర్నలిస్టుల్లో ఐకమత్యం, క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు జయరాజ్ అన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశం స్థానిక గోకుల్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నేతలు బాలసుబ్రహ్మణ్యం, ఒ జయచంద్ర పాల్గొన్నారు. జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. జర్నలిస్టు అక్రిడిటేషన్ విధి విధానాల్లో మార్పులు చేపట్టాలని ప్రభుత్వానికి ఇప్పటికే సూచించమని, త్వరలో ఆ విధానాలు వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేర్పులు చేపడుతారన్నారు. ప్రతి జర్నలిస్టు తప్పనిసరిగా హెల్త్ స్కీమ్ ఉపయోగించుకోవాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులను వర్కింగ్ జర్నలిస్టులుగా గుర్తించడం ఏపీడబ్ల్యూ జేఎఫ్ యూనియన్ పోరాటాల ఫలితమే అన్నారు. రాష్ట్రంలోని అతి పెద్ద యూనియన్ ఏపీడబ్ల్యూజేఎఫ్ అన్నారు. వేదికపై జిల్లా నేతలతో పాటు సీనియర్ జర్నలిస్టులు కేసి టీవీ అధినేత ఎన్ ముత్యాలు, రామనాథ్, మురళి (ప్రజాశక్తి), మురళి (ఆంధ్రజ్యోతి)ఏబిఎన్ మురళి, సలీమ్, కడియాల మహేష్‌తో పలువురు జర్నలిస్ట్‌లు ప్రసంగించారు. ఈ సమావేశానికి నియోజకవర్గం నుండి చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాల నుండి జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ జర్నలిస్టు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు

ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జీఆర్ మురళి (ఏబీఎన్), అధ్యక్షుడుగా ఎస్ఆర్‌సతీష్ (జీ తెలుగు) ను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళి (ప్రజాశక్తి), ఉపాధ్యక్షులు, రెడ్డప్ప (సూర్య) గిరీష్ కర్నాల్లు (సాక్షి), కృష్ణమూర్తి (99 టీవీ), నూరేషా (ఆంధ్రప్రభ), ఎం కృష్ణమూర్తి (సివిఆర్), మల్లెల గిరిబాబు (మనం) ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి గా పీప హిదాయితుల్ల (రాజ్ న్యూస్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామారావు (ఆంధ్రజ్యోతి), సహాయ కార్యదర్శిగా ఎల్ నాగరాజు (వార్త), లక్ష్మీనారాయణ (పబ్లిక్ టుడే), ఎం బాబు (తెలుగు ముచ్చట్లు), లక్ష్మీ ప్రసాద్ (పబ్లిక్ బైట్), అమ్మినేని గుర్రప్ప చౌదరి (వార్త), కోశాధికారిగా భాను ప్రకాష్ (ఐ న్యూస్), లీగల్ అడ్వైజర్‌గా టి శ్రీనివాసులు (ఆంధ్రప్రభ)లను ఎన్నుకున్నారు.


మురళి (ప్రజాశక్తి)
ఏపీడబ్ల్యూజేఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్


ఎస్ఆర్ సతీష్,
ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రెసిడెంట్

ఫ్లెమింగో ఫెస్టివల్

మౌలిక వసతులు పరిశీలన

ప్రజాశక్తి - దొరవారిసత్రం: మూడు రోజుల పాటు జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌కు విచ్చేసే పర్యాటకులకు భద్రతతో పాటు, మౌలిక వసతులు సౌకర్యవంతంగా వుండాలని తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం కానుండడంతో శుక్రవారం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యాటకులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పర్యాటకులను పలకరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జేసీ శుభంబన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీవో కిరణ్మయి, పర్యాటక శాఖ అధికారి జనార్ధన్‌రెడ్డి, తహశీల్దార్ శైలకుమారి, డిపిఒ సుశీలదేవి పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వే త్వరగా పూర్తి చేయాలి: డీపీవో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: స్వమిత్వ సర్వే త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు అధికారులను ఆదేశించారు. మండలంలోని సంక్రాంతి పల్లె పంచాయతీలో నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సర్వేను సమగ్రంగా చేపట్టి నివేదికలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో పార్వతి, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్‌డి గణపతి, పంచాయతీ కార్యదర్శి ఉమాపతి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వమిత్వ సర్వే తీరును పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

ఫలించిన రైతుల ఆందోళన

- స్పందించిన అధికారులు
- క్వారీ పై ఆరా
- ఆవేదన విన్నవించుకున్న అన్నదాతలు
- సమగ్ర విచారణకు సమయం కోరిన అధికారులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : తమకు నష్టం కలిగిస్తున్న క్వారీని తొలగించాలని కోరుతూ కుప్పం మండలం వానగుట్టపల్లి, విమిట్టపల్లి పంచాయతీలకు చెందిన రైతులు చేపట్టిన ఆందోళన ఫలించింది. ఆందోళనను ఆలకించిన ప్రభుత్వ అధికారులు స్పందించారు. సమగ్ర పరిశీలన చేసి పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భూగర్భ గనులు, పర్యావరణ, రెవెన్యూ, పోలీసు శాఖలు శుక్రవారం సంయుక్తంగా వానగుట్టపల్లి, వి మిట్టపల్లి పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న క్వారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు రాతి పరిశ్రమ, ఆ పక్కన ఉన్న క్వారీ నిర్వహణపై ఆరా తీశారు. మైనింగ్ అధికారులు సర్వే చేపట్టి క్వారీ తవ్వకాలు, పేలుడు నిర్వహిస్తున్న పద్ధతులపై విచారించారు. అనంతరం అధికారులను కలుసుకున్న అన్నదాతలు తమ ఆవేదనను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వ్యవసాయ భూమిలో నివాసం ఏర్పరచుకుని జీవిస్తున్నామని, క్వారీలో నిర్వహిస్తున్న పేలుడు వల్ల తాము నిర్మించిన ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, వ్యవసాయ బోరుబావులు సైతం పూడి పోతున్నాయని తెలిపారు. రాతి పరిశ్రమ వల్ల వెలువడే దుమ్ము ధూళి రైతులు పండిస్తున్న పంటను నాశనం చేస్తోందని, ముఖ్యంగా పంట పొలాలను ఆవహిస్తున్న రాతి పొడి వల్ల పొలాలు వ్యవసాయానికి పనికి రాకుండా పూర్తిగా నిస్సారంగా మారుతున్నాయని అధికారుల ముందు తమ ఆవేదనను విన్నవించారు. ప్రధానంగా క్వారీ నిర్వహిస్తున్న గుట్టపై కాటమ్మ దేవాలయం ఉందని, క్వారీలో నిర్వహిస్తున్న పేలుడు వల్ల దేవాలయం పగుళు ఏర్పడిందని తెలిపారు. ఈ విషయమై స్పందించిన అధికారులు బాధితుల ఇళ్లను, గుట్టపై వెలసిన దేవాలయాన్ని, రాతి పరిశ్రమ చుట్టూ ఉన్న వ్యవసాయ భూములను పరిశీలించారు. అనంతరం దీక్ష శిబిరానికి అధికారులు చేరుకున్నారు. అన్నదాతలను ఉద్దేశించి మాట్లాడుతూ రాతి పరిశ్రమ నిర్వహణపై విచారణ మొదలైందని, సమగ్ర విచారణకు సమయం పడుతుందన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు రాతి పరిశ్రమపై విచారణ జరిపి, సమగ్ర నివేదికను ఏడు రోజుల్లో జిల్లా పాలనాధికారికి అందిస్తామని తెలిపారు. అనంతరం అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామని, అంతవరకు రైతులు సమన్వయం పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూగర్భ గనుల శాఖ ఏజీ కుమారస్వామి, పర్యావరణ శాఖ ఏఇ మదనమోహన్, కుప్పం మండల డిప్యూటీ తహశీల్దారు సూర్య ప్రకాష్, డిఎస్‌పి పార్థసారథి, పట్టణ సీఐ శంకరయ్య పాల్గొన్నారు.


రైతులకు హాని కలిగిస్తున్న క్వారీని పరిశీలిస్తున్న అధికారులు


దీక్షా శిబిరం వద్ద రైతులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

జాయింట్ కలెక్టర్ విద్యాధరి

ప్రజాశక్తి - రామకుప్పం: రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి సూచించారు. భూ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు భూ హక్కు హద్దులు చూపి, పాసు పుస్తకాల్లో తప్పిదాలు లేకుండా చర్యలు తీసుకోవా లన్నారు. శుక్రవారం రామకుప్పంలో విఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేలో సమన్వయంతో రైతుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారికి భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఆర్డిఓ శ్రీనివాసరాజు, తహశీల్దార్ బాబు, డిప్యూటీ తహశీల్దారు బాలాజీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


రెవెన్యూ అధికారులతోసమీక్షిస్తున్న జేసీ విద్యాధరి

తాగునీటి సమస్య పట్టదా?

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: తమ గ్రామంలో 'ఆరు నెలలు గా తాగునీటి సమస్యను ఎదుర్కొం టున్నా అధికారులు పట్టించు కోకపోవడంతో నిరసిస్తూ మండలంలోని పాతపేట పంచాయతీకి చెందిన కుప్పనపల్లి గ్రామ మహిళ లు ప్రశ్నిస్తూ వీధిలో ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మండలంలోని పాతపేట పంచాయతీకి చెందిన కుప్పనపల్లిలో సుమారు రెండు వందలకుపైనే కుటుంబాలు నివసిస్తున్నాయని ఆరు నెలలుగా చాలీచాలని తాగు నీటితో కాలం వెళ్లదీస్తున్నామని మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కారణంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తారని ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశామని తెలిపారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి తమకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని పరిష్కరించకుంటే జిల్లా కార్యాలయాల వద్ద, రోడ్లపై రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. తమ తాగునీటి కష్టాలను గుర్తించి వెంటనే సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరారు. దీనిపై స్థానిక ఎంపీడీవో రాజేంద్ర బాలాజీని విచారణ కోరగా వెంటనే పంచాయతీ కార్యదర్శిని అక్కడికి పంపి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

నేడు ఉల్లాస్ వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి- సోమల: సోమల మండలంలోని 34 మంది ఉల్లాస్ వాలంటీర్లకు శనివారం ఉదయం 11 గంటలకు ఒక్కరోజు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఏపీఎం శివ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 34 మంది వాలంటీర్లు, 340 మంది అభ్యాసకులకు చదువు చెప్పేందుకు ఎంపిక చేశామని, వీరికి గతంలో ఒకసారి శిక్షణ ఇచ్చామని ప్రస్తుతం ప్రభుత్వం నుండి మెటీరియల్ వచ్చిందని వాటి పంపిణీకి మార్గదర్శకంగా అటెండెన్స్, రిజిస్టర్, హాజరు పట్టిక తదితర వాటిని ఎలా నిర్వహించాలో శిక్షణలో వివరిస్తామన్నారు. వర్ణమాల చార్ట్ , బ్లాక్ బోర్డు, ఫ్లాష్ కార్డులు, పెన్సిల్ , రబ్బరు, చాక్ పీస్ తదితర మెటీరియల్ వచ్చాయని వాటిని పంపిణీ చేస్తామపి ప్రతి వాలంటీరు శిక్షణకు హాజరుకావాలని తెలిపారు.



గర్భిణులకు, బాలింతలకు ఆకుకూరలు, కూరగాయలు అందిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

బాలింతలకు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 2వ విడత టిహెచ్ఆర్ పంపిణీలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలో పోషక ఆహారమైన ఆకుకూరలు, కూరగాయలు శుక్రవారం పంపిణీ చేసి వాటి విలువలను, గర్భిణి దశలో తీసుకోవాల్సిన ఆహారాన్ని, పెరటి తోటల పెంపకాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.



కుష్టు నిర్మూలన సర్వే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిహెచ్‌వో లక్ష్మీనారాయణ

సర్వేను విజయవంతం చేయండి: హెల్త్ ఆఫీసర్

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈ నెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీ య కుష్టు నిర్మూలన సర్వేను విజయవంతం చేయాలని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ కోరారు. కుష్టు వ్యాధి నిర్మూలన సర్వేకి సంబంధించిన గోడ పత్రికలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ మాట్లాడుతూ కుష్టు రహిత భారతదేశాన్ని స్థాపించాలనే సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహిస్తున్నారని, ఆశా కార్యకర్తలు తప్పనిసరిగా ప్రతి గృహాన్ని గృహంలోని, ప్రతి వ్యక్తిని పరీక్షించి నివేదికలు సమర్పించాలన్నారు. ఒక గృహం లోని ఒక వ్యక్తి కూడా తప్పిపోకుండా కుష్టు వ్యాధి సర్వేను సమగ్రంగా చేపట్టాలని సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపరువైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, ఎంఎల్ హెచ్‌పి లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చేపల చెరువు వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

చేపల వేలంలో రూ.లక్ష 81 వేలు ఆదాయం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చేపల వేలంలో లక్ష 81 వేల రూపాయలు ఆదాయం పంచాయతీకి లభించిందని, ఇన్‌ఛార్జి పిఓపిఆర్‌డి గణపతి శుక్రవారం పేర్కొన్నారు. మండలంలోని పాలేరు పంచాయతీలోని చిల్ల మల్ల చెరువు ఆరు నెలలు పాటు చేపల కోసం వేలం పంచాయతీ కార్యదర్శి ఐయేషా జులేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెల నుండి జూన్ వరకు ఆరు నెలలు పాటు చేపలను పట్టుకునేందుకు లీజుకు ఇస్తామని ఈ లీజులో పాటదారులు లక్షా 81 వేల రూపాయలు హెచ్చు పాట పాడారని వారికి చేపలు పట్టుకునేందుకు లిఖితపూర్వకంగా అనుమతి అందిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలకూర ప్రసాద్ రెడ్డి , ఉప సర్పంచ్ శ్రీకాంత్, మాజీ ఎంపిటిసి లోకనాథం, గ్రామస్తులు జానకి రామానాయుడు, శివారెడ్డి , కాంత రావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ వద్ద పారిశుధ్య నిర్వహణ

ప్రజాశక్తి - పలమనేరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్' లో భాగంగా ప్రతినెలా 3వ శనివారం పారిశుధ్య నిర్వహణ వుంటుందని ఇందులో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్య నిర్వహణ వుంటుందని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి శుక్రవారం సాయంత్రం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పలమనేరు శాసన సభ్యులు ఎన్ అమరనాథ్ రెడ్డి , మున్సిపల్ ఛైర్ పర్సన్ జి చాముండేశ్వరి, , వైస్–ఛైర్ పర్సన్–1 పి గుల్జార్, వైస్ ఛైర్మన్ టు ఆర్ రవి, కౌన్సిల్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, ఎన్‌జీఓలు, ప్రజలు అందరూ తప్పక హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా చిట్టిబాబు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కొల్లా చిట్టిబాబు

ప్రజాశక్తి -గుడిపాల: బిజెపి సీనియర్ నాయకుడు కొల్లా చిట్టిబాబు 67వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుడిపాల క్రాస్ రోడ్‌లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమనాథ్ గౌడ్, హేమాద్రి నాయుడు, బాల, శేఖర్, కిట్టు, హరీష్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి -పెద్దపంజాణి: ద్విచక్ర వాహనంలో వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించి ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని శుక్రవారం ఎంపీడీవో బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరలతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, ప్రజలకు హెల్మెట్ వాడకంలో అవగాహన కలిగించాలని సూచించారు. ఎవరూ ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించకూడదన్నారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా రహదారి సూత్రాలను పాటిస్తూ హెల్మెట్ ధరించి నడపాలని స్థానిక పంచాయతీ అధికారులు కూడా గ్రామాల్లో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఈ మేరకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తప్పనిసరిగా ప్రభుత్వ ఆదేశాలను అందరూ పాటించాలని సూచించారు.

రక్షణ గోడలు నిర్మించండి

స్థానికుల అభ్యర్థన

ప్రజాశక్తి- బంగారుపాళ్యం:
భారీ ప్రమాదం జరగకముందే రక్షణగా పిట్ట గోడలు నిర్మించాలని వాహన దారులు మొరపెట్టుకుంటున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాత పోస్ట్ ఆఫీస్ మలుపు వద్ద మురికి కాలువ ఉండడంతో ద్విచక్ర వాహన దారుడు అందులో పడి గాయపడ్డాడని ఇకనైనా సంబంధిత అధికారులు పిట్ట గోడలను నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.



ప్రమాదకరంగా మారిన రహదారి

గృహ నిర్మాణాల్లో ముందు ఉండాలి: ఎంపిడివో

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన గృహాలు నిర్మించేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాల్లో జిల్లాలో మండలం ముందు ఉండే విధంగా అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో బాలాజీ అధికారులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సీసీలతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఇంకా పూర్తి కావాల్సిన వివిధ దశల్లో ఉన్న గృహాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి,లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు.మండలంలో 1612 గృహాలకు గానూ,1295 గృహాలు పూర్తి అయినాయని,ఇంకా 381గృహాలు పూర్తి చేయాల్సి ఉందని,బేస్మెంట్ లెవెల్లో 62 పనులు, లింటెల్ లెవెల్ లో 71, రూఫ్ లెవెల్ లో150, రూఫ్ కంప్లీషన్ స్టేజ్‌లో 97 గృహాలు ఉన్నాయని ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయిలో గృహ నిర్మాణ పనులను ప్రతి రోజూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఎప్పటికప్పుడు బిల్లులు అప్లోడ్ చేయాలని ఎక్కడా లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం వహించవద్దని ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్, ఇంజనీర్ ఇన్‌ఛార్జి బాలచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ హేమలత, ఉపాధి హామీ ఏపీవో మురుగేషన్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ నాగమణి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు దేవేంద్ర, వెంకటరమణారెడ్డి, విజయలక్ష్మిరెడ్డి పల్లవి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడివో బాలాజీ

పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలి.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నేడు శనివారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయంలో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో బాలాజీ అధికారులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో తప్పనిసరిగా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో బాలాజీ పంచాయతీ కార్యదర్శులను సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ చిన్న బాపనపల్లి దళితవాడలో తాగునీటి సమస్య నెలకొంది. ఈ నేపథంలో సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, గాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అధికారులను సమస్యను పరిష్కరించాలని ఆదేశించడంతో మూడు లక్షల జెడ్పీ నిధులు మంజూరు చేయించి వెంటనే ఎంపీడీవో మోహన్ మురళి చిన్న బాపన పల్లి గ్రామానికి వెళ్లి గ్రామంలో ఉన్న కొత్త బోరుకు పైపులు మోటరు ఏర్పాటు చేసి గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. సకాలంలో స్పందించి తమ గ్రామానికి తాగునీరు అందించిన ఎమ్మెల్యేకు చిన్న బాపనపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా మురళీధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరిం చారు. శుక్రవారం టిడిపి నేతలు ఆయనకు పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఎంపీడీవోగా విధులు విధులు నిర్వహిస్తున్న లక్ష్మీకాంత్ సెలవుపై వెళ్లడం తో ఉన్నతాధికారులు ఇక్కడి సూపరింటెండ్ మురళీధర్ రెడ్డికి ఇన్‌ఛార్జి ఎంపిడిఓ గా బాధ్యతలు అప్పగించారు. కాగా మండల అభివృద్ధికి ప్రజలు , ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నర్సింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, నందా రెడ్డి, మనోహర్, సుబ్రీ,మాజీ సర్పంచ్ లు ,రామకృష్ణప్ప, కామరాజ్ నాయక్, జయశంకర్, బాలరాజు, ఆదిల్, కుమార్,వెంకటరమణ, బాబు పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి ఎంపిడిఓను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఊపిరి పీల్చుకున్న విశాఖ ఉక్కు: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గత ఐదు సంవత్సరాలుగా అనేక కష్టనష్టాలకు గురైన విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం నేడు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడంతో విశాఖ ఉక్కు ఊపిరి పీల్చుకుందని టీడీపీ బీసీ విభాగం నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అన్న నినాదాన్ని నిజం చేస్తూ,చెప్పిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి ఫలితంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్లతో ఆర్థిక ప్యాకేజీని ప్రకటించడం యావత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకానికి సంతోషకరమైన విషయం అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు, నెమళ్ళూరు బుజ్జి, కోట చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి: ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమ పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తానని జిల్లా ఇన్చార్జి ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది చేయూత కార్యక్రమంలో బాగంగా ఆయన మాట్లాడుతూ పోలీసు కుటుంబాలకు తన సహానుభూతిని తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం ఎల్లప్పుడూ తమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుళ్లు విజయకుమార్ నాయక్, బి. లక్ష్మీనారాయణ, కె. శ్రీనివాసులు, వీరి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1,00,000 చొప్పున మొత్తం రూ.3,00,000 చెక్కులను అందజేశారు.

హోంగార్డులకు వైద్య సాయం:

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 10 మంది హోంగార్డులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4,999 చొప్పున మొత్తం రూ.49,990 చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, హోంగార్డ్స్ ఆర్.ఐ. పోతులురాజు. మృతుల పోలీసు కుటుంబ సభ్యులు, హోంగార్డులు పాల్గొన్నరు.



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందిస్తున్న ఎస్‌పి

సీడాప్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సొసైటీ ఫర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలో పీఎంఎఫ్‌ఎంఈ పథకం ద్వారా మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్ గా ఉపాధి అవకాశాలు కల్పనకు ఎంపికలను నిర్వహిస్తున్నామని డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రిసోర్స్ పర్సన్ ఉపాధి అవకాశానికి పురుషులు, మహిళలు, ట్రాన్స్ జెండర్ లు అర్హులుగా పరిగణిస్తామని, ఏదేని డిగ్రీ పూర్తయి 21 నుండి 30 ఏళ్ల వయసు మధ్య ఉన్నవారు తెలుగు భాష చక్కగా మాట్లాడడం, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైన వారికి తగు శిక్షణ రెండు రోజులపాటు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆహార పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి ఔత్సాహితులకు తగిన ప్రోత్సాహకాన్ని అందించినందుకుగాను రూ.10 వేలు, ఫ్యాసై రిజిస్ట్రేషన్ కు సంబంధించింది రూ.10 రూపాయలు ఇన్సెంటివ్ గా రిసోర్స్ పర్సన్ పొందుతారన్నారు. ఈ ఉపాధి అవకాశం కేవలం ఇన్సెంటివ్ ఆధారం గానీ ఉంటుందని, ఎలాంటి నెలవారి జీతం అందజేయబడదని స్పష్టం చేశారు. మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్ గా పని చేయడానికి ఔత్సాహిక అర్హత కలిగిన అభ్యర్థులు 9963561755, 9701387293 నంబర్లను సంప్రదించాలన్నారు. అభ్యర్థి ఈనెల 20వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ కు ఆఖరి గడువుగా పేర్కొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయ జయంతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక రాజ గోపురం వద్ద శ్రీకృష్ణదేవరాయ జయంతిని శుక్రవారం నిర్వహించారు. మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పాలాభిషేకం చేసి పుష్ప మాలలు వేసి నివాళులర్పించారు. రాజా నీతిజ్ఞుడైన శ్రీకృష్ణదేవరాయలు దేశ చరిత్రలోనే అత్యున్నత పాలనతో అటు ఆధ్యాత్మిక చింతన, ఇటు జీవన వైవిధ్యాన్ని అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. నేటి యువత శ్రీకృష్ణదేవరాయలు స్ఫూర్తితో సమాజ హితం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణ మూర్తి, అంజూరు వెంకటేష్ బాబు, కంట ఉదయ్ కుమార్, ఉత్తరాజీ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

పిల్లల హత్య కేసులో తల్లి అరెస్ట్



ప్రజాశక్తి -సదుం : ఇంట్లో గొడవ పడి పిల్లల హత్యకు కారణమైన తల్లిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సదుం ఎస్ఐ షేక్ షావలి కథనం మేరకు..మండల పరిధిలో గత ఆదివారం కరిష్మా(27) తన అత్తతో ఘర్షణపడి, తన ఇద్దరు పిల్లలను ఎలక్ట్రిక్ వైర్‌తో ఉరివేసి చంపి, ఆ తర్వాత ఆమె ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటనపై, చౌడేపల్లి రూరల్ సిఐ ఎం రాంభూపాల్ ఆధ్వర్యంలో సదుం ఎస్ఐ షేక్ షావలి శుక్రవారం నిందితురాలు కరిష్మాను సదుం బస్టాండ్ ఏరియాలో అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. అరెస్టు అయిన మహిళను మదనపల్లి కోర్టుకు సరెండర్ చేయగా, జడ్జి ఆమెకు ఈ నెల 31వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సదుం ఎస్ఐ షేక్ షావలి తెలిపారు.

కొబ్బరి చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుడిపల్లి: కొబ్బరి చెట్టుపై నుండి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గుడిపల్లి మండలం యామగానపల్లి గ్రామానికి చెందిన వెంకటస్వామి(63) తన సొంత పొలంలో ఉన్న కొబ్బరి కాయల కోసం గురువారం సాయంత్రం కొబ్బరి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో చుట్టుపక్కల వారు గమనించి అతడిని హుటాహుటిన పిఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఇతనికి కుమారుడు, కూతురు, భార్య వున్నారు. ఇతని కుటుంబానికి స్థానిక పంచాయతీ టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



మృతి చెందిన వెంకటస్వామి (ఫైల్ ఫొటో)

రైల్వే పట్టాలపై యువకుడి మృతదేహం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణం గుళ్లేపల్లి ప్రాంతంలో రైల్వే పట్టాలపై యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ప్రాథమిక విచారణ చేపట్టారు. కాగా మృతుడు కుప్పం మండలం వెండుగాంపల్లి గ్రామానికి చెందిన కృష్ణమూర్తిగా గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలని, మొదటి భార్య మరణించిన అనంతరం రెండవ వివాహం చేసుకున్నాడని, వీరికి నలుగురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. మద్యానికి బానిసైన మృతుడు ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు రైల్వే పోలీసుల విచారణలో తేలాల్సి వుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణ- పలువురికి గాయాలు



ప్రజాశక్తి - వెదురుకుప్పం: ఇరు గ్రూపుల ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా పలువురు స్వల్పంగా గాయపడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామంలో ఇరు గ్రూపుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆటోల ద్వారా చికిత్స నిమిత్తం ఆటోల ద్వారా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించుకుంటున్నాడు.ఘర్షణపై స్థానికు పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.



కోకో పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి

కోకో పంట లాభదాయకం

జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కోకో పంటతో మంచి లాభదాయకం పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 170 గొల్లపల్లిలో రైతు వెంకట రమణకు చెందిన కోకో పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోకో పంటకు ఒక ఎకరాకు రెండు వందల మొక్కలు నాటు కోవచ్చని ఒక మొక్క ఖరీదు 18 రూపాయలు అవుతుందని, ప్రైవేట్ మార్కెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం దీనికి రాయితీ అందిస్తుందని మొదటి సంవత్సరం రూ.12 వేలు, రెండో సంవత్సరం రూ.4 వేలు, మూడో సంవత్సరం రూ. 4 వేలు, మూడు సంవత్సరాల తర్వాత పంట దిగుబడి వస్తుందని ఒక కేజీ మార్కెట్లో ధర ఆరు వందలు ధర పలుకుతుందని ఒక ఎకరాకు దాదాపు రూ.3 లక్షల పైనే ఆదాయం అందుతుందని దీన్ని అవసరమైన రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి సాగరిక, రైతులు పాల్గొన్నారు.

అమరరాజలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ



ప్రజాశక్తి- తవణంపల్లి: అమర రాజా సంస్థల చేయూతతో, రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా దిగువమాఘం గ్రామంలో నూతనం గా ఏర్పాటు చేసిన అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ (ఏఆర్ఎస్‌డిసి) లో నిరుద్యోగ యువతకి ఉచిత శిక్షణ, ఉపకార వేతనం, ఉద్యోగావకాశం పొందేందుకు మొదటి బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సర్ఫేస్ మౌంట్ టెక్నాలజీ, పీసీబీ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సులో 24 నెలలు (3 నెలలు ట్రైనింగ్ సెంటర్, 21 నెలలు కంపెనీలో) శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణా కాలంలో రూ.12,072 ఉపకార వేతనం (స్టైపెండ్) ఇవ్వ నున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ నెల 20వ తేదీన అమర రాజా స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ (ఏఆర్ఎస్‌డిసి) దిగువమాఘంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 10 వ తరగతి పాస్, ఫెయిల్ లేదా ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8712608589, 9739290499, 8807226264 ఫోను నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జోరుగా టిడిపి సభ్యత్వాల నమోదు

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి -శాంతిపురం: టిడిపి సభ్యత్వాలు జోరుగా సాగుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ, విజనరీ నాయకత్వ లక్షణాలను చూసిన రాష్ట్ర ప్రజలు టిడిపి సభ్యత్వాలు తీసుకునేందుకు పోటీపడుతున్నారని, సభ్యత్వ నమోదు ప్రారంభించిన వంద రోజుల్లోనే టీడీపీ కోటి దాటిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాంకేతికతను ఉపయోగించి పేపర్ లెస్ విధానంలో ఇన్ని సభ్యత్వాలు నమోదు చేయడం ఒక్క టీడీపీకే సాధ్యం అన్నారు. పెద్ద మొత్తంలో నమోదు కావడం ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత, మంత్రి లోకేష్ దార్శనికత, కార్యకర్తల పట్ల చూపించే అంకితభావం, శ్రద్ధకి నిదర్శనం అన్నారు. కేవలం రూ.100 కే సభ్యత్వం తీసుకున్న పార్టీ కార్యకర్తలకు రెండేళ్లపాటు రూ.5 లక్షల బీమా అందిస్తుందన్నారు. ఇటీవల కార్యకర్తల సంక్షేమం నిమిత్తం ఇన్స్యూరెన్స్ కంపెనీతో యువనేత లోకేష్ ఒప్పందం చేసుకున్నారన్నారు. కార్యకర్తల సంక్షేమం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్న విషయాన్ని గమనించిన రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వాలను స్వీకరిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లోనూ పోటీపడి సభ్యత్వాలు తీసుకుంటున్నారని, తెలంగాణలోనూ పెద్ద ఎత్తున సభ్యత్వాలు నమోదవుతున్నాయని తెలిపారు.

